వర పుత్రుడు

కోచెంట్ల హైమవతి

ఎదురుగా ఉన్న దంపతుల్నీ, వారి చిరంజీవినీ చూచేసరికి స్వామికి పాతిక సంవత్సరాల క్రితం గృహ త్యాగం చేసి పరమగురువుతో బయలు దేరటం గుర్తుకొచ్చింది. తనకు జన్మ నిచ్చినందుకు తను వాళ్లకేం చేశాడు సేవ?....? పోనీ....సన్యాసిగా వాళ్ళకేం ఉపకారం చేశాడు.....?.....?.....?.....

"అంతా దైవేచ్ఛ....!" చిన్నగా నవ్వు కుంటూ ఆ వచ్చిన కుటుంబాన్ని దీవించి పిబూది, కుంకుమ ఇచ్చి పంపించారు స్వామి.

తరువాత పది నిమిషాలలోనే ఆయన యోగనిష్ఠలోకి వెళ్లిపోయారు. గుబురుగా పెరుగుతున్న గెడ్డం, మీసాలలోంచి మబ్బుల్లో చందమామలా కాంతులు ప్రసరిస్తూ చిరునవ్వుతో నిర్మలంగా ఉన్న మొహంలోకి తన్మయత్వంగా చూస్తూ మనస్సుని అంతర్ముఖంగా మరల్చు కోవటానికి ప్రయత్నిస్తున్నారాయన శిష్యులు.

అర్ధరాత్రిలో ఆశ్రమం వరండాలో అటూ, ఇటూ పచార్లు చేస్తున్నారు స్వామీజీ. మనస్సులోనే అంచనాలు వేసుకుంటూ ఆలోచిస్తున్నారు. ఆ అంచనాల పర్యవసానమే మరుసటి రోజున ముగ్గురు శిష్యులతో జీలుగుపట్టు గ్రామానికి ప్రయాణం సాగింది.

* * *

ఆ ఊరికి ఏ స్వామీజీ వచ్చినా రామాలయంలోగాని, ఆంజనేయస్వామి ఆలయంలోగాని ఉపన్యసించేవారు. ఈ స్వామి సరాసరి పాడుబడిన సత్రానికి ఎందుకొచ్చాడో అర్థం కాలేదు. అకస్మాత్తుగా శిష్యులతో సహా స్వామీజీ అక్కడికి వచ్చేసరికి అక్కడ పేకాటలో గోలగా అరుచుకుంటూ సిగరెట్ మీద సిగరెట్ ఊదేస్తూ, ఆ ఊరి యువతుల

వేషభాషలు - ఆకార స్వభావాల మీద జోక్‌లు విసురుకుంటున్న యువక బృందం చేష్టలుడిగి గుడ్లప్పగించి చూస్తుండిపోయింది.

"చూడండి బాబూ! నే చెప్పేది నిదానంగా వినండి. ఈ పేకముక్కలు ఇంత శ్రద్ధగా పంచుకుంటున్నారే మరి! ఈ ఊరిలోని కష్టసుఖాలనూ, ఇబ్బందులనూ కూడా మీరిలాగే పంచుకుంటే...... వాటిని తొలగించటానికి ప్రయత్నిస్తే కాలం సద్వినియోగం అవుతుంది." అన్నారు స్వామి.

ఒకతను హేళనగా నవ్వుతూ "దీంట్లోని థ్రిల్........ఓహ్ మీకు తెలియదు స్వామీ....!"

"నిజమే! నాకు తెలియకపోవచ్చు. కాని.... సంఘసేవలో, తల్లిదండ్రుల సేవలో, న్యాయార్జనలో దీనికంటే రెట్టింపు థ్రిల్ ఉందిబాబూ! దాని అనుభవం పొందితేనేగాని అర్థంకాదు."

ఆ ఊరిలోకెల్లా పచ్చిరౌడీ అని పేరు తెచ్చుకున్న ముకుందం స్వామివైపు విసుగ్గా చూశాడు. "ఇక్కడ అనవసరపు బోధ చెయ్యకండి. ఈ బోధలు ఏ ముసలివాళ్ళదగ్గరకో వెళ్ళి చెయ్యండి. మాలాంటి వారి వద్ద మీ ఉనికి, ఉపన్యాసాలూ సుద్ధ వ్యర్థం. వెళ్ళండి. ముక్కు మూసుకొని మూల కూర్చోవలసిన మీరు ఇలా మా మీదకి దండెత్తటానికి అర్థం?"

స్వామి ముకుందాన్ని చూస్తూ చిరునవ్వుతో తల పంకించారు. "కాలం దగ్గరకొచ్చిన ముసలివాళ్ళేం చెయ్యగలరు బాబూ! రోజుకి కొన్ని నిర్ణీత సమయాలలో ముక్కు మూసుకొని ఈ జగత్సర్వాన్నీ మరచి భగవధ్యానంలో గడపటం ఎంత ముఖ్యమో, మిగతా సమయంలో సంఘసేవ కూడా అంత ముఖ్యం. మీలాంటి యువకులు సంఘసేవకు ముందుకు వచ్చి, ఈ సమయాన్ని చక్కగా వినియోగించాలి."

"ఓహ్హో...హ్హో.... డైలాగులు బా....లా బాగున్నాయి. ఇలాంటి బైరాగుల వల్ల ఎవరికీ లాభం లేదు. దొంగ పోజులూ వీళ్ళూను." అన్నాడు ముకుందం మిత్రుడు. మిగతా అందరూ పకపక నవ్వారు.

ఇంకొక మిత్రుడు అతి నిర్లక్ష్యంగా చూస్తూ మళ్ళీ పేకముక్కలు నలుగురికీ పంచాడు. అందరూ ఆ ముక్కల్ని చేతుల్లోకి తీసుకున్నారు. ముకుందం తలెగరేస్తూ "మమ్మల్ని ఏమార్చటం మీ తరం గాదు. మీరేం చెయ్యగలిగితే అది చెయ్యండి." అన్నాడు పొగరుగా.

మిగతా ముగ్గురూ అతన్ని బలపరుస్తున్నట్లు నోళ్ళు అష్టవంకర్లూ తిప్పి వెక్కిరిస్తున్నట్లు వికటంగా నవ్వారు. వారి పిచ్చిచేష్టలు స్వామీజీకి నవ్వు తెప్పించాలి. కాని ముకుందం సవాలు

చేస్తున్నట్లు పలికిన మాటలు వారికి బుద్ధి తెలిపేందుకు దారి, ఉపాయం తెలిపాయి.

కొంచెం సేపు కళ్ళు మూసుకొని నిశ్చలంగా నిలిచారు. తర్వాత కనులు విప్పి చికిలించి వారి చేతులలో ఉన్న పేకముక్కలవైపు చూశారు స్వామీజీ. అవి భగ్గున అంటుకున్నాయి. చేతులు చుర్రుమనటంతో, తెల్లబోతూ చేతిలో ఉన్న పేకముక్కలు కంగారుగా క్రిందకి పదిలేశారు.

"ఏం బాబూ! వదిలేశారేం? భద్రంగా దాచుకోండి వాటిని. థ్రిల్ అనుభవిద్దురు గాని." అన్నారు స్వామి అదే చిరునవ్వుతో.

"మాడి మసైపోయాయ్. అవెందుకు....?" అన్నాడు ముకుందం. మిగతా యువకులు ఈ సంఘటనతో కాస్త బెదిరారనే చెప్పవచ్చు. కాని.... ముకుందం....మాత్రం....? ఉహు....!

"ఈ పేకాటల్లో పడి బ్రతుకుని అశ్రద్ధ చేస్తే మీ జీవితాలు, మీ ప్రక్కనున్న వారిజీవితాలూ 'ఇదిగో' ఇలాగే మాడి మసైపోతాయి. మీకు....ఆ కాలి మసైన ముక్కలకున్న విలువే మిగుల్తుంది. బాగా ఆలోచించి మీ ఈ దురలవాటు మానుకోండి!" నిదానంగా చెప్పారు స్వామీజీ.

నలుగురు మిత్రులూ ఒకరి నొకరు చూచుకొన్నారు. ముకుందం మిగతావారి వంక విప్లవాత్మకంగా చూడటంతో ఆ సైగను అర్థంచేసుకొన్న ముగ్గురు మిత్రులూ స్వామీజీని హింసించి అవమానించాలనే దృష్టితో ముందడుగు వేశారు. తలమీద, వీపుమీద, గుండెల మీద, ముఖం మీద నలుగురూ కలిసి దబదబ బాదారు. తమ మోచేతులతో అందిన చోటెల్లా పొడిచారు. స్వామీజీ ఏమాత్రం చలించలేదు. వారు నలుగురికీ విపరీతమైన ఆశ్చర్యం వేసింది.

నలుగురూ కలసి స్వామీజీని ఎత్తి కిందవేసి బాగా అణగతొక్కాలను కొన్నారు. ఇద్దరు చేతులూ, ఇద్దరు కాళ్ళూ పట్టుకున్నారు. నలుగురూ దృఢకాయులే. ఏం లాభం....? ఎంత శ్రమ పడినా స్వామీజీని అంగుళం కూడా కదల్చలేకపోయారు. వారిలో పట్టుదల పెరిగింది. మరింత బండతనంగా వాళ్ళ శక్తినంతా పణంగా పెట్టి మళ్ళీ, మళ్ళీ, మళ్ళీ ప్రయత్నించారు. చమటలు పట్టి వాళ్ళ శరీరాలు అమితంగా అలసిపోయాయి తప్ప ఇంకేమీ మార్పు కనిపించలేదు అశక్తతమీద వాళ్ళకే చాలా కోపం వచ్చింది. ముఖ్యంగా ముకుందానికి అవమానంతో దుఃఖంకూడా వచ్చేసింది. కాని....ఇంకోపక్క మహా ఆశ్చర్యంగా ఉంది కూడా!

'ఇంత సన్నని స్వామీజీలో అంత శక్తి ఏమూల దాగివుంది? ఏమిటీ మాయ? తన శక్తి....ఇంతేనా? తనను మించినవాడెవడూ లేడనుకున్నాడే!'

విచిత్రంగా స్వామివంక చూస్తుండి పోయాడు ముకుందం.

మిగతా ముగ్గురూ "క్షమించండి స్వామీ" అంటూ కన్నీరు కారుస్తూ ఆయన పాదాలమీద ఒరిగిపోయారు.

అప్యాయంగా వారి తలలు నిమిరి "బాబూ! ఉన్న ఆయుష్షు కాస్తా ఇలాంటి వ్యసనాలకి ఖర్చైపోతే ఇంక మనిషి జన్మెత్తింది ఏం చెయ్యటానికి? కేవలం చెడ్డ పనులు చెయ్యటానికి మాత్రమేనా? చెడు స్నేహాలు మానేసి బుద్ధిగా బతకండి. సద్బుద్ధి సత్ప్రవృత్తిని చూపుతుంది. పోయిరండి" అని దీవించి పంపించారు స్వామీజీ.

వారు వెడుతూ ముకుందం వంక 'నువ్వు కూడా వస్తావా?' అన్నట్లు చూశారు. కాని ముకుందం వారిని గమనించలేదు. ఏదో అలౌకికమైన దృశ్యం చూస్తున్నట్లూ, తానేదో అపూర్వమైనదాన్ని కనుగొన్నట్లూ స్వామీజీని ఆసక్తిగా చూస్తూ నుంచున్నాడతడు.

ముకుందం వంక ప్రీతిగా చూస్తూ 'ముకుందం!' అన్నారాయన.

ఉలిక్కిపడి "నా పేరు మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"తమ్ముడి పేరు అన్నగారికి తెలియటంలో ఆశ్చర్యమేముంది!"

అర్థంకాక కనుబొమలు ముడివేసి స్వామీజీకేసి చూశాడు ముకుందం.

"లౌకిక భాషలో, బాంధవ్య పరిగణనలో, ఈ జన్మ కథలో నువ్వు నా శరీరానికి తమ్ముడివి. నా శరీరం నీకు అన్నగారవుతుంది."

"నాకు...నాకు నమ్మకం కుదరటం లేదు." బేలగా అన్నాడు ముకుందం.

ఒకగంట తర్వాత స్వామి ఆనతి ప్రకారం స్వామీజీ శిష్యులతోబాటు ముకుందం కూడా కోనేటిలో స్నానం చేసి బట్ట పిండి ఆరేసి, అవి ఆరాక కట్టుకుని వచ్చి స్వామికి చేతులు జోడించి అతని సమీపంలో కూర్చున్నాడు. స్వామీజీ చెప్పే మాటలకోసం అతని మనస్సు, చెవులు ఆత్రపడుతున్నాయి.

* * *

వసుంధర మాటలను కాదనలేక బైరాగిని లోపలికి పిలిచాడు భాస్కరం. ప్రకాశిస్తున్న బైరాగి ముఖంలోకి చూస్తూ భక్తిగా నమస్కరించింది వసుంధర. భార్య ననుసరించాడు భాస్కరం. మనసులో భార్యమీదున్న విసుగు చెదిరిందతనికి. బైరాగి ముఖంలోని దివ్యతేజస్సు చూచి చకితుడయ్యాడు భాస్కరం.

వసుంధర వేసిన చిరుచాపను ప్రక్కకి తోసి జింకచర్మం పరచుకొని దానిపై ఆశీనుడయ్యాడు బైరాగి. హృదయం చేస్తున్న తొందరకు నిదర్శనంగా వసుంధర తనచేతిని చాచి అతని ముందుంచింది. ఆతృత నిండిన ఆమె

ముఖాన్నవలోకించిన బైరాగి చెయ్యి చూడకుండానే చెప్పసాగాడు,

"అమ్మా నువ్వు మాతృత్వంకోసం పరితపిస్తున్నావు. నీకు సంతానం కలుగుతుంది తల్లీ....నీ కోరిక తప్పక నెరవేరుతుంది ..."

"ఎప్పుడు స్వామీ .... ఎప్పుడు?" సంతోషంతో కంగారుగా ప్రశ్నించింది ఆమె.

"చాలా కష్టనష్టాల అనంతరం....నీ గర్భం ఫలిస్తుంది. వికలాంగులకు దండిగా దానధర్మాలు చెయ్యి. నీమీద ఆధారపడిన వారిని కనికరించు నీమీద కృతజ్ఞత కలిగేలా వ్యవహరించి ఆ దీనుల దీవెనలందుకో. భగవద్భక్తిని పెంచుకో." కనులు మూసుకొని యోచిస్తూ చెప్పాడు బైరాగి.

"అలాగే స్వామీ! మీ మాటను అనుక్షణం గుర్తుంచుకొని ఆచరిస్తాను. ఆశీర్వదించండి" సాష్టాంగపడింది వసుంధర.

"మంచిదమ్మా! నీకు పుత్రుడుదయించగానే శ్రీశైలం ప్రాంతంలో అరణ్యంలోని మఠాన్ని మనసారా స్మరించు తల్లీ. నా ధ్యానమే నీ పుత్రజనన వార్త నాకు తెలుపగలదు."

అంగీకారంగా తలూపింది వసుంధర. భాస్కరానికి చిన్నతనం నుంచీ బైరాగుల మీదున్న చులకన భావం ఈనాడే స్వామిని చూడగానే పటాపంచలైంది. నాగస్వరం విన్న సర్పంలాగ విన్రముడై బైరాగి మాటలు వింటున్నాడు భాస్కరం. ఇద్దర్నీ శాంతదృష్టితో చూస్తూ "త్యాగబుద్ధి అలవర్చుకోండి. మీకు ప్రాణప్రదమైన దాన్ని త్యాగం చెయ్యాల్సి వచ్చినా జంకకుండా మనస్ఫూర్తిగా త్యాగం చెయ్యండి. దైవం మిమ్మల్ని మెచ్చి .... మీకు మేలు చేయుగాక...." గంభీరంగా చెప్పి లేచి నుంచున్నాడు బైరాగి.

"స్వామీ....!" దంపతులిద్దరూ ఒకేసారి అన్నారు. వారి కళ్ళల్లోని అభ్యర్థన, సంశయం కనిపెట్టిన బైరాగి చిరునవ్వుతో "బైరాగిని నాకేం కావాలమ్మా! నాకు కావల్సినది లోకకళ్యాణం. అవసరమైన సమయంలో నేనే వచ్చి మీరివ్వవలసిన సహాయం అర్థిస్తాను. సడలని ధైర్యంతో భగవానుని అర్చించండి." అంటూ వారి జవాబుకై ఎదురుచూడకుండా చరాచరా సాగిపోయాడు బైరాగి.

బైరాగి ఆఖరి మాటలు విచిత్రంగా విన్పించాయి భాస్కరానికి. వసుంధర భక్తిగా బైరాగి వెళ్ళినవైపే చూస్తూ ఉండిపోయింది. సంతాన భాగ్యంకోసం తాము చెయ్యబోయే సత్కార్యాలను ఆమె మనస్సులో చిత్రించుకోసాగింది.

* * *

వసుంధర, భాస్కరం పుణ్యక్షేత్రాలు దర్శిద్దామని బయలుదేరారు. సమయానికి వాహనాల సౌకర్యం దొరికేది గాదు.

దానిమూలంగాకొంత,కొంత పాదయాత్రే చెయ్యాల్సి వచ్చేది. ఆ యాత్రలో ఎన్నో ఇబ్బందులను, అవస్థలను ఎదుర్కొన్నారు. వారి పొరుగు యాత్రికులు బుద్ధిమంతులు కాకపోవటంతో, వారినుంచి నిందలూ, మనోవ్యథా భరించారు. కొన్నిచోట్ల త్రాగటానికి నీరుకూడా దొరికేది కాదు. ప్రతీ చిన్న విషయానికి చిరాకుపడే భాస్కరం ఓర్పుగా ఉండటం చూసి ఆశ్చర్యంగా ఉండేది వసుంధరకి. ఆ మాటే భాస్కరంతో అంటే "ఈ పరిస్థితుల్ని బట్టి ఆలోచిస్తే ఇదంతా దైవపరీక్షేమో అనిపిస్తోంది" అన్నాడు భాస్కరం. "నిజమేనేమో" సంతోషంగా అనుకొన్నదామె.

ఎంతటి చిక్కు పరిస్థితులొచ్చినా దేనినీ నిందించలేదా దంపతులు. ప్రతీ ఆలయంలోనూ భార్యతో కలిసి సంతాన ప్రాప్తికోసం ఎన్నడూ ఎరుగనంత శ్రద్ధగా ప్రార్థించాడు భాస్కరం. ముఖ్యమైన యాత్రాస్థలాలన్నీ చూసి వెనుతిరిగారు.

ఇంటికి వచ్చేసరికి తలుపులన్నీ సగం, సగం పగులకొట్టి ఉన్నాయి. ఇనప్పెట్టె అంతా ఖాళీ. ఎవర్ని నిందించగలరు? ఇరుగు పొరుగువాడు వచ్చి "చప్పుళ్ళు విని మొగవాళ్ళను లేపి, మేమందరం కలిసి వచ్చేసరికి దొంగలు పారిపోయారు" అని చెప్తే "అంతా దేవుని లీల. మధ్య మీరేం చెయ్యగలరు." అని చెప్పి వచ్చినవారందరికీ ప్రసాదం,

పసుపు, కుంకుమ లిచ్చి పంపింది వసుంధర.

'ఈ ఇబ్బందులన్నీ పంటలు రాగానే సర్దుకుంటాయిలే,' అనుకొని దంపతులు ఒకరికొకరు ధైర్యం చెప్పుకొన్నారు. కాని ఆ యేడు కురిసిన అతివృష్టి ఫలితంగా పంటలన్నీ పాడయిపోయాయి. పిల్లా, పాపలతో తిండికి లేక అల్లాడి పోతున్న ఆ రైతు కుటుంబాలను చూసి వారిని పంటగింజలు అడగలేదు సరిగదా తమవద్దనున్న ధాన్యం తమతోబాటు వారికే పంచారా పుణ్యదంపతులు

సంస్కృతాంధ్రాలలో పాండిత్యం గడించిన భాస్కరం ఆ ఊరిలోని హైస్కూల్లో ఉపాధ్యాయుడుగా పని చెస్తున్నాడు. ఆ సంవత్సరం అంతా ఆ జీతం రాళ్ళతోనే సరిపెట్టుకున్నారు. "ఎంత లక్షాధికారినైనా కాలం భిక్షాధి కారిని చెయ్యగలదనటానికి నిదర్శన మిదే" అన్నాడు భాస్కరం.

కాలం నిదానంగా గడుస్తోంది. తర్వాత సంవత్సరం అనావృష్టి ఫలితం కొంత, తెగుళ్ళు పట్టి కొంత పంటలు పెళింపిపోగా, రెండవప్రక్క "వినాశ కాలే విపరీత బుద్ధీ" అన్నట్లు సమ్మెలు జరిపి హైస్కూలు మూసివేయటం వల్ల ఆ ఆధారం కూడా ఆగిపోయింది వారికి.

నిరంతరావస్థలకు గురైనారు. ఆ పరిస్థితిలో ఆ కరువు, కాటకాలకు తట్టుకోలేక విసిగిన ఆ దంపతులకు 'బైరాగి' చెప్పిన సూక్తులు గుర్తొచ్చి వారి విసుగును 'సంతానభాగ్యమనే' తరంగం వచ్చి చెరిపేసేది. సుడిగాలి ఎదరనున్న దూదిపింజల్లా చెదిరి తునా తునకలై దానిస్థానే శాంతి, భక్తి మొలకలెత్తి వృద్ధిచెందేవి.

"మనకి మంచిరోజులు రాబోతున్నాయి. అందుకే ఈ అనర్థాలన్నీ సమూహంగా మనపై దండెత్తుతున్నాయి. చీకటి ఉధృతం హెచ్చాకే గదా ఆ చీకటి చెదిరి వెలుగురేఖలు వచ్చి సూర్యోదయ మయ్యేది?" అనుకొని దంపతు లిద్దరూ మంచి రోజుల కోసం ఎదురుచూడ సాగారు.

* * *

"ఏమండీ మరొక్కసారి ఆ మల్లి కార్జునుడి దర్శనం చేసుకోవాలని కోరికగా ఉందండీ" అన్న వసుంధర కోరికని అన్ని ఇబ్బందులైనా వాయిదా వెయ్యలేదు భాస్కరం.

పాఠశాల తెరిచి జీతం అందగానే భార్యను తీసుకొని యాత్రకి బయలు దేరాడు భాస్కరం. ఉపవాసంతో కాలి నడకన కొండ ఎక్కుతున్న వసుంధర మనస్సులో 'మల్లికార్జున స్తుతి' పరిస్తున్నది. స్వామి సాకార వర్ణనతో ఆమె హృదయం నిండిపోయింది ఆమె కన్నులకు సర్వం ప్రకాశమయంగా, జ్యోతిర్మయంగా కనపట్టింది. శరీరం మాత్రం నిస్సత్తువగా సొమ్మసిల్లింది.

ఆమె భక్తిపారవశ్యం ఎరిగివున్న భాస్కరం కంగారుపడలేదు. అతి సున్నితంగా ఉన్న భార్యను మెల్లగా ప్రక్కకు జరిగి పరుండజేసి మరచెంబులోని చల్లనినీరు ఆమె వదనమ్మీద చిలకరించి భార్యకు తెలివి తెప్పించాడు. మృత్యుంజయ స్తోత్రం చదువుతూ భార్యను లేవదీశాడు.

ప్రక్కనుంచి నడచిపోతున్న కాషాయాంబరధారి వీరిరువుర్నీ చూచి చిరునవ్వుతో "నీవు ధ్యాన్నించు మృత్యుంజయుడై నీ ఇంట వెలయునులే" అనటం విని ఆశ్చర్యంగా అటు చూశారు. భక్తిగా నమస్కరించారు. అప్పటికే అతడు మూడు మెట్లు దాటిపోయాడు. సన్యాసి ఆశీస్సు విన్న వసుంధర రెట్టించిన ఉత్సాహంతో మెట్లెక్కటం మొదలెట్టింది.

* * *

శ్రీశైలం నుంచి వచ్చిన తర్వాత తొమ్మిది నెలలు నిండుతూనే పండంటి బిడ్డనెత్తుకొంది వసుంధర. నామకరణం పీటలమీద కూర్చున్న వసుంధరకి శ్రీశైలం మెట్లమీద దీవించిన సన్యాసి మాటలు గుర్తొచ్చి "నా బాబు మృత్యుంజయుడు. పుట్టకముందే పేరు స్థిరపర్చుకున్నావా తండ్రీ" అంటూ ముద్దుచేసింది. ఆ పేరే భాస్కరం బియ్యం నింపిన పళ్ళెరంలో వ్రాశాడు.

* * *

అల్లారుముద్దుగా పెరుగుతున్న మృత్యుంజయుడు నాల్గవ ఏటనే వారి పూర్వాచార ప్రకారం అక్షరాభ్యాసం చేయించుకొని చదువులో ప్రవేశించాడు. "ఓం నమఃశివాయః" మొదలుపెట్టిన వారం రోజులకే మొదటి తరగతి పుస్తకంలోని పేర్లు చదవటం మొదలుపెట్టాడు. ఒకసారి చదివిన వాక్యాన్ని రెండవసారి చూడకుండా అప్పజెప్తున్న కుమారుని జ్ఞాపకశక్తి అతని తల్లిదండ్రుల్ని తబ్బిబ్బు చేసింది.

జాతకం వ్రాయటంలో మంచి అనుభవం ఉన్న వసుంధర తండ్రి మృత్యుంజయుడి జాతకం చూసి నిర్ఘాంతపోయాడు. కాని అతదే విషయమూ ఎవ్వరికీ చెప్పలేదు. మామగారు బాలుని జాతకం చూసి కూడా ఏమీ చెప్పకపోవటంతో దానికి అనేక కారణాలు సృష్టించుకొని తల్లడిల్లిపోయాడు భాస్కరం. అతడు మామగార్ని ఏ సంగతీ చెప్పమని బలవంతం చెయ్యటంతో ఇంక విధిలేక "మన మృత్యుంజయుడు సామాన్య బాలుడు కాడు. మనం చెయ్యగలిగిందేమీ లేకపోయినా ఒక కంట అతడిని కనిపెడుతూ ఉండు క్రమేపీ నీకే తెలుస్తుంది" అని మాత్రం చెప్పాడు.

మృత్యుంజయుడు తన ఆరవయేడు పూర్తయేసరికి నాలుగు తరగతుల పుస్తకాలు సునాయాసంగా ముగించాడు.

పట్టుమని పదినిమిషాలు కూడా పుస్తకం ముట్టని మృత్యుంజయుడు రెండు సంవత్సరాలలో నాలుగు తరగతులు ముగించేసరికి విస్తుపోయారు భాస్కరం, వసుంధర.

మృత్యుంజయుడ్ని గురించే ఆలోచిస్తున్న వసుంధరకి ఆరోజు సరిగ్గా నిద్రపట్టలేదు. "వయసుకి మించిన తెలివి మృత్యుంజ యుడి కుండటం మంచి లక్షణమా?" అనే ఆలోచన వచ్చేసరికి వసుంధర గుండె దడదడ లాడింది! తన తండ్రి భర్తను రహస్యంగా తీసుకెళ్ళి ఏదో చెప్తూంటే తమా చాటునుంచి కుతూహలంగా విన్న సంగతి గుర్తొచ్చిందామెకు.

తండ్రి తన దగ్గర ఆ విషయాలు వివరంగా చెప్పకపోవటానికి కారణం ఏమిటి? ఇన్నాళ్లూ తనా విషయాన్ని ఎందుకు అశ్రద్ధ చేసింది? తండ్రి హెచ్చరిక గుర్తొస్తూనే కొడుకు పుస్తకాలు పరీక్షిద్దామని గబగబా లోపలి గదిలోకి వెళ్ళిందామె. మృత్యుంజయుడి అలమరు తెరచి అతని క్లాసు పుస్తకాలన్నీ పరీక్షించింది.

ఇంకా అడుగున ఉన్న పుస్తకాలు తీసి పేజీలు తిరగేసిన వసుంధరకి ముచ్చెమటలు పోశాయి. ఆశ్చర్యం, దుఃఖం, సంతోషాలతో ఉక్కిరిబిక్కిరవుతూ భర్తను కుదిపి లేపింది. భర్త బద్ధకం వదిలించి విషయం వివరించింది. సంగతంతా విన్న భాస్కరం "నేను వాడి ధోరణి చూస్తూనే ఉన్నాను. వాడు చదువు నేర్చుకొంటున్నట్లెప్పుడూ కనబడడు. ఎప్పుడూ ఏదో జ్ఞాపకం చేసుకుంటున్నట్లే కనబడతాడు. ఊఁ, పద చూద్దాం" అంటూ భార్య వెనకాలే అడుగువేశాడు భాస్కరం.

పద్యాలు చెప్పటానికే నోరు తిరగని వయస్సుగల మృత్యుంజయుడినోట్సుల్లో అన్నీ సంస్కృత శ్లోక పరంపరలే. వాటిని భర్తకు చూపించి అర్థం అడిగింది వసుంధర.

ఎంతో నీతిని బోధించే ఆ శ్లోకాల్లో అంతా కఠిన సంస్కృత పదజాలమే. అవన్నీ చదువుతూ తనని తానే మరచిపోయాడు భాస్కరం. చదివి తానర్థం చేసుకొని వసుంధరకు చెప్తూ నాలుగు పేజీలు పూర్తిచేసేసరికి తెల్లవారు ఝామయింది. కోడికూత ధ్వనితో ఈ లోకంలోకి వచ్చిపడ్డారా భార్యాభర్తలు.

ఆ మరునాటి రాత్రి భాస్కరమే పుస్తకాలన్నీ వెదికి, వెదికి వెలికితీశాడు. ఒక్కొక్క పుస్తకం ఒక్కొక్క సాటిలేని కావ్య కళాఖండం. భాస్కరం ఆశ్చర్యానందాల్ని కూడా మరచిపోయి గ్రంథ పఠనంలో మునిగిపోతున్నాడు. రోజుకొక గ్రంథాన్ని పరిశీలించి భద్రపరచుకుంటున్నాడతడు.

ఆరోజు ఆఖరి పుస్తకాన్ని తీశాడు. "స్వీయకథ" అనే అక్షరాల్ని విస్మయంగా

చూస్తూ పేజీలు తిప్పాడు. అందులో ఒకపుట అతన్ని అమితంగా ఆకర్షించింది.

"నేను రాజశేఖరుడిని. నా కావ్యాలలో, గ్రంథాలలో నిత్యం తప్పులు పట్టే రామభద్రయతిని ఎదిరించాను. కోపంతో రెచ్చిపోయి అతనిని నానా దుర్భాషలాడాను. 'తన కోపం తన శత్రువు!' అను నానుడి నాయందు నిరూపితమైంది. రామభద్రయతి "శాపం" వల్ల క్రితం జన్మలో యతిని కాలేకపోయాను. అయిష్టంతోనే పెండ్లాడి, బిడ్డల్ని కని వారిని సాకలేక, విస్మరించలేక నలిగి, నలిగి పరలోకాని కేగాను. నా ఈ జన్మకు కారకుడైన రామభద్రయతి దర్శనం ఎప్పటికో ?

అయన ఈ ఇంటివాకిటకి వచ్చి నాకీ భవబంధ విముక్తి కావిస్తానని వాగ్దానం చేసి, మరీ, మరీ ఒప్పించి నన్ను వీరి కొమరుని గావించాడు.

ఆయన రాకతో నాకు శాప విముక్తి అవుతుంది. నేను యతిని అవుతాను"

ఈ పై వాక్యాలు చదివిన భాస్కరానికి పితృవాత్సల్య బాష్పధారలాగలేదు.

తానెంత అదృష్టవంతుడు? తా నెప్పుడో చదువుకొన్న రాజశేఖర చరిత్ర ! ఇతనిదే ! సందేహం లేదు" అనుకొన్నాడు

అయితే రామభద్రయతి దర్శనం తనకూ అవుతుందా ? ఎవరతడు ? ఎక్కడుంటాడు ? నిజంగా అతడింకా బ్రతికే వున్నాడా ? యిప్పటి రాజశేఖర చరిత్ర ? అప్పటి రామభద్రయతి ఇప్పటికీ ఓహ్ యతీశ్వరులకు అసాధ్యమేముంది ?

ఇదంతా తెలిస్తే వసుంధర ఏమౌతుంది ? ఇహలోక బంధాలు త్రెంచుకొన్న చిన్నారి మృత్యుంజయుడ్ని విడిచి ఉండగలదా ? తన కొమరుని స్థితికి ఆనందం ఒక ప్రక్క, లేక లేక కలిగిన ముద్దుబిడ్డడు దూరమవుతాడే అనే చింతతోనూ నలిగిపోతున్నాడు భాస్కరం.

అతడి దుఃఖ, సంతోష మిశ్రిత పరిస్థితి గ్రహించిన వసుంధర భర్తను తరచి, తరచి అడుగగా "మన బాబు మనకు దక్కడు వసుంధరా" అన్నాడతను నిట్టూరుస్తూ.

"అంటే అంటే " సీటిపొర మెరిసింది వసుంధర కంటిలో.

"కంగారుపడకు. క్షేమంగా నే ఉంటాడు. కాని ముందు, ముందు మనతో కలసి ఉండకపోవచ్చును. మనకు బాబు దూరమైపోతాడనిపిస్తోంది నాకు." భార్యకు ధైర్యం చెప్పిన భాస్కరం కళ్ళు కూడా చెమర్చాయి.

నిదానంగా విన్న వసుంధర మొహం నిస్తేజంగా అయిపోయింది.

"జరిగేది జరగక మానదు. అంతా భగవద్విలాసం" భార్యకి నచ్చచెప్తూ

తనకి తానే, మనస్సుకి వైరాగ్యశిక్షణ ఇచ్చుకోవటం ప్రారంభించాడు భాస్కరం.

* * *

అంతా అర్థం చేసుకొని హరాయించుకోలేని వసుంధరకి అయోమయంగా రోజులు గడుస్తున్నాయి. మమతాబంధాలను దూరంగా నెట్టి ఆ శుభ సమయం కోసం ఎదురుచూస్తున్నాడు భాస్కరం.

ఒకనాటి అర్ధరాత్రి అకస్మాత్తుగా మెలకువ వచ్చి మళ్ళీ నిద్రపట్టలేదు భాస్కరానికి. త్వరలో ఏదో ఘటన జరగబోతోందని మనస్సు తొందర చెయ్యటం మొదలెట్టింది. మెల్లగా భార్య, కొడుకు పడుకున్న మంచం దగ్గరకెళ్ళాడు. గాఢంగా నిద్రపోతున్న వసుంధర మొహంలో ఒకప్రక్కగా సన్నని నిస్పృహరేఖ తారట్లాడటం గమనించి ఆవేదనగా నిట్టూర్చాడు.

యోగనిద్రలో ఉన్నట్లు చేతుల్ని గుండెమీద ధ్యానరూపంలో జోడించి నిద్రపోతున్నాడు పాలబుగ్గల మృత్యుంజయుడు. వెనుతిరగబోయిన భాస్కరానికి ఏదో స్ఫురణకు రాగా మెల్లిగా వంగి "మృత్యుంజయా బాబూ! !" అని పిలిచాడు. దానికి ఎటువంటి జవాబు రాలేదు.

వసుంధర మాత్రం ప్రక్కకి వత్తిగిలి పడుకుంది.

కొంతసేపాగి "రాజశేఖరా !" నెమ్మదిగా పిలిచాడు భాస్కరం. మృత్యుంజయుడు "ఊ(" అన్నాడు.

"నీ కెవరు కావాలి" అడిగాడు భాస్కరం.

"రామభద్ర యతీశ్వరులు కావాలి. వచ్చారా ! ఏరీ !" అంటూ హడావిడిగా లేచి కూర్చున్నాడు మృత్యుంజయుడ. వసుంధర కూడా ఉలికిపడి లేచి కూర్చుంది. బెంగగా ఉందామెకు. ఈ సంఘటన చూచి పుట్టెడు దుఃఖపడింది. కాని ఏం చెయ్యగలదామె? భగవధ్యాన్నం చేస్తూ "కొడుకుని నాకు దక్కించు భగవాన్" అని వేడుకొన్నది. ఆమె దీనవదనం భాస్కరాన్ని కలవరపరచింది.

* * *

ఒక శుభోదయాన మృత్యుంజయుడు పుట్టుకను తెలిపిన బైరాగి వారింటి తలుపు తట్టాడు. తలుపు తీసిన భాస్కరం, లోపలినుంచి వచ్చిన వసుంధర బైరాగికి సాష్టాంగపడ్డారు. బైరాగిని చూడగానే గతంలో అతడు చెప్పిన "త్యాగబుద్ధి అలవరచుకోండి" అన్న మాటలు గుర్తొచ్చాయి భాస్కరానికి.

ఉత్కంఠ దాచుకోలేక "మీరు రామభద్రయతీశ్వరులా స్వామీ!" అని అడిగాడు భాస్కరం.



"అవును " అన్నారాయన చిరునవ్వుతో.

తెల్లబోయి చూస్తున్న వసుంధరకి ఆ రోజు రాత్రి "కొడుకు నోటినుంచి వచ్చిన పేరిదే!" అర్థమైంది.

ఏదో తెలియని భీతి కలిగి భర్తవైపు చూసింది బేలగా.

బైరాగి ఆజ్ఞతో అంతా వివరంగా ఆమెకు చెప్పాడు భాస్కరం. లోకమంతా చీకటైనట్లు అయి తెలివి తప్పిందామె. ఎన్నో ఉపచారాలు చేశాక స్పృహవచ్చిన వసుంధర బైరాగిని "మోసగాడనీ, మాంత్రికుడనీ" నిందించింది. పోలీసులకు పట్టిస్తానని బెదిరించింది. ఇంకా ఏవేవో నానామాటలూ అంది. ఆమె పుత్రవాత్సల్యం పీడలేక అలా గడబిడ చేస్తోందని తెలుసు భాస్కరానికి. ఆమె చేస్తున్న తప్పిదానికి ఆ బైరాగి ఏమి శపిస్తాడోనని భయంతో తల్లడిల్లిపోయాడు భాస్కరం. అతనికి వసుంధర పుత్రప్రేమ ఒక సమస్య లాగే అన్పించింది.

కాని బైరాగి చిరునవ్వుతో అన్నీ భరించాడు. ఆమెను రెచ్చగొట్టకుండా పసిపాపను చూసినట్లు వాత్సల్యంగా చూశాడామెవైపు.

చివరకు వసుంధర దుఃఖంతో "వరం ఇచ్చినట్లు మాకు పుత్రుడు కలుగుతాడని దీవించావు. వాడిని మళ్ళీ నీవే తీసుకొని మమ్మల్నన్యాయం చేస్తావా స్వామీ! నా కొడుకును నానుంచి దూరం చేసిన పాపానికి నీకు నరకం ప్రాప్తించదా!" అంటూ దీనంగా ప్రార్థించింది.

మానసిక వైకల్యాన్ని భరించలేక

ఎళ్ళి అంతలోనే బైరాగిని దూషించింది. బైరాగి కోపం తెచ్చుకోలేదు. ఎంతో ఉన్నతంగా మానవధర్మాన్నీ, భగవత్సృష్టినీ విడమర్చి బోధించాడు. "అమ్మా నువ్వు మాతృదేవతవి. నీ మనోవ్యథ ఎటువంటిదో నాకు తెలుసు తల్లీ. కాని ఒక మాణిక్యకాంతినీ, దాని ఫలితాన్ని మనం ఒక్కళ్ళమే అనుభవించాలనే స్వార్థం కంటే దేశం—లోకం అందరూ ఆ మాణిక్య ప్రకాశాన్నీ, అది బోధించే సుసూక్తినీ పంచుకోవాలనే ఉద్దేశ్యం ఉత్తమమైనది."

"నీ మృత్యుంజయ కుమారుడు కారణజన్ముడు. అతన్ని కన్న నీకు లోకం జోహార్లు అర్పిస్తుంది. జన్మనిచ్చిన తల్లిదండ్రుల్ని మరచే దుర్గుణం నీ మృత్యుంజయుడి వద్ద లేదమ్మా! నా మాట నమ్ము తల్లీ!"

"నీవు త్వరలోనే గర్భం దాల్చి నీ వంశం నిలబెట్టే సుపుత్రుడినీ, ఏడేడు తరాల్ని తరింపజేసే సద్గుణవతియైన సుపుత్రికను కవల సంతానాన్ని పొందబోతున్నావు. నిరాశ, నిస్పృహాలను దరిజేరనీయకు. ప్రతీ కుటుంబంలోనూ నలుగురిలో ఒకడు యోగై, విషయ వాంఛలకు దూరమై దేశానికి ఉపయోగపడితే, సంఘ—దేశ—లోక అభ్యుదయానికి నడుంకడితే ఏ దేశంలోనూ కరువు కాటకాలుండవు. దేశం సుభిక్షమవుతుంది. స్వార్థాన్ని విడనాడు తల్లీ. కలగబోయే సంతానం నీకు కన్నుల పండుగ చేయగలదు. నీ ఈ మృత్యుంజయుడిని మాత్రం దేశాని కర్పించు తల్లీ."

వసుంధర నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది బొమ్మలాగ. ఆమె యోచనా ముద్ర చూచిన బైరాగి 'లోహం వేడెక్కి ఉన్నప్పుడు వేసిన దెబ్బలకే బాగా సాగుతుందని' గ్రహించిన కమ్మరిలాగ సమయం కనిపెట్టి తన బోధ తిరిగి కొనసాగించాడు.

"అమృతం లాంటి ఔషధాన్ని రోగికివ్వకుండా సీసాలోవేసి దాన్ని అతి భద్రంగా దాస్తే ఏమైనా ప్రయోజనం ఉందమ్మా! నువ్వే ఆలోచించు. ఇలాంటి వరపుత్రుడిని కన్నందుకు మీరిద్దరూ పుణ్యదంపతులుగా ఖ్యాతి పొందుతారు. ఇంతటి వరపుత్రుని కని జగత్తుకి అర్పిస్తున్నందుకు ఆనందించాలి గాని దుఃఖించటం అవివేకం తల్లీ."

దైవోపదేశం వింటున్నట్లు అంతా విన్నది వసుంధర. మెల్లిగా బాహ్య దృష్టిలో పడింది. తన తప్పిదాలను మన్నించమని బైరాగిని వేడుకుంటూ సాగిలపడింది. చిరునవ్వుతో ఆశీర్వదించి, వారిచ్చిన అర్ఘ్యపాద్యాలను స్వీకరించి, ఫలాన్ని ఆరగించి "అమ్మా మీ దంపతులిర్వురూ భగవన్నామస్మరణ మానవద్దు. అదే మిమ్మల్నాదుకొని ఒడ్డుకు చేర్చేది." అంటూ తన జోలె

లోంచి 'వేదాంత సారం' అనే గ్రంథాన్ని బహూకరించి ముందుకు సాగిపోయాడు రామభద్రయతి.

అతడటు వెళ్ళగానే వసుంధర మళ్ళీ ప్రాపంచక స్థితిలో పడిపోయింది. తనకు తానుగా వైరాగి వచ్చిన విషయం మృత్యుంజయునికి తెలియజేయరా దనుకొన్నది వసుంధర. భాస్కరాన్ని కూడా చెప్పనివ్వలేదు.

ఆ మరునాడు తెల్లవారి లేస్తూనే "రామభద్రయతీశ్వరులనేవారు మనింటికి వచ్చారామ్మా!" అని అడిగాడు మృత్యుంజయుడు.

దడదడలాడే గుండెను అదిమిపట్టుకుంటూ ఆర్తిగా భర్తవైపు చూచిందామె. "అవును. వచ్చారు" అన్న తండ్రి జవాబుతో మృత్యుంజయుడి ముఖం కొన్ని సంవత్సరాల అనంతరం ప్రియ మిత్రుడిని కలుసుకొన్నట్లు విప్పారింది తండ్రి నడిగి సంగతంతా తెలుసుకొని ఆ రోజంతా ఉత్సాహంగా గడిపివేశాడు.

మరునా డుదయమే తలిదండ్రులకు

నమస్కరించి- "అమ్మా! మీ ఇద్దర్నీ నేను ఎన్నటికీ మరచిపోను. నేను సన్యసించాలని నిర్ణయించుకున్నాను. పుట్టబోయే చెల్లాయి, తమ్ముడూ మీకు కుటుంబ సంబంధమైన కోరికలు తీరుస్తారు. రేపు సూర్యోదయానికి పూర్వమే నేను సన్యాసాశ్రమానికి బయలుదేరబోతున్నాను. నన్ను గురించి నువ్వు విచారించవద్దు. నా సన్మార్గానికి అడ్డుచెప్పకు. నాచుట్టూ వాత్సల్యపు తెరను దించకమ్మా! నా ఔన్నత్యాన్ని కోరుతూ అందరికీ ఆత్మీయుడైన పరమేశ్వరుణ్ణి స్మరించు. నువ్వు నిత్యం భజించే సర్వాంతర్యామిలోనే నన్ను చూడు. నీకు తప్పక మనశ్శాంతి దొరుకుతుంది" అన్నాడు మృత్యుంజయుడు.

భాస్కరం దగ్గరకు చేరి 'కన్న కూతుర్ని అత్తవారింటికి పంపుతూ జాగ్రత్తగా చూచుకొమ్మని' అల్లుని అర్థిస్తున్న కన్నతండ్రిని జ్ఞప్తికి తెచ్చే మోముతో "నాన్నగారూ! అమ్మ చాలా అమాయకురాలు. ఆమెకు ధైర్యంచెప్పి నామీదున్న బెంగ తగ్గించగల నేర్పు మీకుంది. ఆ ఆశే నన్నిలా బయలు దేరేలా చేస్తోంది" అంటూ శారీరకంగా ఉన్న వయసుకి మించిన మాటలు చెప్తూ అప్పగింతలు పలుకుతున్న ఆ బాల యోగిని కౌగలించుకొని బావురుమంది వసుంధర.

మృత్యుంజయుడి మాటలు వింటూ 'బాహ్యరూపానికి ఏడు వసంతాల వయస్సేగావి, మానసికంగా ఎంత వృద్ధుడీ బాలుడు? క్రితం జన్మం చివరవరకూ సంపాదించిన జ్ఞానమంతా ఆత్మలో పదిలపరచుకొని ఆ శరీరాన్ని మాత్రం త్యజించి, మళ్ళీ నూతన కాయాన్ని మా బిడ్డగా ధరించాడు. ఆ జన్మలో గ్రహించగా మిగిలిన జ్ఞానాన్ని ఈ జన్మలో పూరించుకుంటాడు. ఈ పునర్జన్మకు కారణమైన పుణ్యకార్యాలు నిర్వహిస్తాడు. ఈ చరితార్థునికి నేను తండ్రిని. చాలు ఎన్ని జన్మలెత్తినా ఈనాటి స్థానం దొరకటం నాలాటి సామాన్యునికి అపురూప వరం' తృప్తిగా గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు భాస్కరం.

నిర్వచారంగా తల్లి కనులు తుడుస్తూ "అమ్మా! నా సంతోషం నీకు దుఃఖమా?" అన్నాడు మృత్యుంజయుడు.

"కాదు నాయనా! కాదు. నిన్ను విడిచి ఉండలేక నా బాధ." అంటూ కొడుకుని గాఢంగా హృదయానికి హత్తుకుంది వసుంధర.

ఆ ఇరువుర్నీ తన రెండు బాహువులతో చుట్టి ఆలింగనం చేసుకొన్న భాస్కరానికి అతని ప్రమేయం లేకుండానే కళ్ళనుండి జాలువారిన అశ్రువులు భార్యా బిడ్డల శిరస్సుల నభిషేకించాయి.

ఆ రాత్రంతా తలిదండ్రులతో ఏమేమో చెప్తూ, చర్చిస్తూ గడిపివేశాడు మృత్యుంజయుడు. మధ్యలో మళ్ళీ, మళ్ళీ స్వార్థపరంగా ఆలోచించి మాట్లాడుతున్న తల్లిని "అమ్మా! ఒకవేళ మీవద్దనే ఉండిపోతాననుకో! నాకు చాలా తొందరగా మృత్యువు రావచ్చు. లేక అంగవికలుడనై, రోగాలతో బాధ పడవచ్చు. అది నీ కిష్టమైతే నీకోసం నా ఈ సుఖజీవనం వదులుకుంటాను." అన్న మృత్యుంజయుడి వాక్కులు అడ్డుకున్నాయి.

మృత్యుంజయుడి నోరు మూస్తూ "బాబూ! అజ్ఞానురాలిని. ఈ పరిస్థితికి తట్టుకోలేక ఏవేవో ఊహించి తికమక పడుతూంది నా మనస్సు. నా అదుపులో నిలవటం లేదది. నీ ఇష్టం బాబూ! నువ్వు ఎక్కడున్నా సుఖంగా, సంతోషంగా ఉండటమే నాకు కావలసింది. నీకు సంరక్షణ చేసిన ఈ చేతులు రేపటి నుంచీ ఆ భాగ్యానికి నోచుకోవుగా బాబూ! నేను ఒట్టి మూర్ఖురాలిని. నిన్ను కన్నప్పుడు నీ సాన్నిహిత్యం శాశ్వత మన్నట్లే పొంగిపోయాను. ఈనాడు నీ ఎడబాటుని భరించలేక క్రుంగి పోతున్నాను తండ్రీ! నేను అతి సాధారణ మైన మనిషినిరా" అంటూ విధవిధాలుగా బాధపడుతూ చేతులారా బిడ్డడి ఒళ్ళు నిమిరి అతని నుదుటిని చుంబించింది వసుంధర.

మృత్యుంజయుడు తన చిట్టి చేతులతో తల్లి మెడను చుట్టి కౌగలించుకొన్నాడు, ఆప్యాయంగా. పుత్ర పరిష్వంగ సుధామాధుర్యాన్ని అనుభవిస్తున్న వసుంధర తన్మయత్వంతో కనులు మూసుకొంది. కొన్ని క్షణాలు అలౌకికానందాన్ని పొందిందామె. కొడుకు తల్లిని ఓదార్చే తీరు చూసి ఆశ్చర్యానందాలతో మూగబోయాడు భాస్కరం. అతనికీ దృశ్యాలు అద్భుతంగానూ, అపురూపంగానూ ఉన్నాయి.

మృత్యుంజయుడు తలిదండ్రులను చూస్తూ చల్లగా, మృదు మధురంగా చిరునగవులు వెదజల్లాడు.

ఆ తెల్లవారు ఝామున మూడున్నర గంటలకు రామభద్రయతీంద్రులు వచ్చారు. దంపతుల్ని దీవించి మృత్యుంజయుణ్ణి తీసుకొని శ్రీశైల పుణ్య క్షేత్రానికి బయలుదేరారు.

వెడుతూ తల్లిదండ్రులిద్దరికీ ప్రణమిల్లి గడపదాటాడు మృత్యుంజయుడు. తమకు మనసైనపుడు కొమరుని చూచి రావటానికి యతీశ్వరుని అనుజ్ఞ అడిగాడు భాస్కరం.

"మీరు గృహస్థులు. మీ ధర్మాలు మీరు నిర్వర్తించండి. ఒకానొక రోజున మీ గృహంలోని కలతలు తీర్చటానికి తనంత తానే స్వయంగా వస్తాడితడు. ఈలోగా మీరు ప్రయత్నించినా

రాలేకపోవచ్చు. అంతా భగవదేచ్ఛ" అడుగులు ముందుకు వేశారు యతీంద్రులు.

వెడుతున్న గురు, శిష్యుల్ని సజల నయనాల్తో చూస్తూ వ్యధచెందిన హృదయంతో నిలబడిపోయింది వసుంధర.

అమరత్వ సిద్ధి పొందటానికి అరుగుతున్న కొమరుణ్ణి కన్నుల పండువగా చూచుకొంటూ ఆనందాశ్రువులు రాల్చాడు భాస్కరం. గురుశిష్యులిర్వురూ సందు మలుపు తిరిగారు. బాలభానుడు మేఘాల చాటుకు తప్పుకొన్నట్లనిపించింది భాస్కరానికి. గాఢమైన తిమిరం అలముకొన్నట్లనిపించింది వసుంధరకి.

నిస్సత్తువగా తూలిపోతున్న భార్యను చేరదీసి అక్కున జేర్చుకొన్నాడు భాస్కరం. "ఏమిటండీ ఈ అసంభవం ?" దుఃఖంతో భర్త బాహువుల్లో ఇమిడిపోయింది వసుంధర.

"ఇలా జరగటం అరుదు. కాని అసంభవం కాదు వసుంధరా ! మహనీయుల చరిత్రలు జ్ఞప్తికి తెచ్చుకో. వాటిని అర్థం చేసుకొని అనుసరించటానికి ప్రయత్నించు. మనం అదృష్టవంతులం. నీ గర్భం అందించిన ఫలం బహు అమూల్యమైనది. మనస్సుని అదుపులోకి తెచ్చుకో. బాబు చెప్పిన మాటలన్నీ అప్పుడే మరచిపోయావా ?" అంటూ భార్య వీపు ప్రేమగా నిమురుతూ లోపలికి తీసుకువెళ్ళాడు భాస్కరం.

మంచినీ, చెడునీ తనలో కలుపుకుంటూ గంభీరంగా సాగిపోతున్న కాలంతో బాటు, భవిష్యత్తుకై ఎదురుచూట్టం ప్రారంభించారు వారు.

* * *

కథంతా విన్న ముకుందం మగతాలోకంలో కొట్టుకుపోతున్నట్లు అలాగే కూర్చుండిపోయాడు. అతడికి తన తల్లి "వాడలాగ, వీడిలాగ. మీరు చూస్తే శక్తి లేక ఇలా ఉన్నారు. ఇంక ఈ పిల్లని ఒక ఇంటిదాన్ని చేసే యోగం లేనట్లుంది" అని బెంగగా తండ్రితో అనటం గుర్తొచ్చింది. అంటే ఇతడు చెప్పినట్లు తన అన్నగారా ఈ స్వామి ? !

ముకుందానికి 'తను అవివేకంగా ఎన్ని సంవత్సరాలు గడిపాడో !' అన్పించింది. "ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు స్వామీ ! మీ సలహా ప్రకారం నడుచుకుంటాను." తల వంచుకొని వినయంగా పలికాడు ముకుందం।

"నీ దురలవాట్లను మాన్చుకో. సద్బుద్ధి అలవర్చుకో. తల్లిదండ్రులకు సేవచేసి వారిని సంతోషపరచు. పరిస్థితులను ఆకళింపు చేసుకొని ఏది అందరికీ సుఖం కలిగిస్తుందని నీ మనస్సుకి తోస్తుందో దాన్ని ధైర్యంగా అనుసరించు."

"నీ చెల్లెల్ని ఒకింటిదాన్ని చెయ్యి. నీ సమయాన్ని వ్యసనాలకు వ్యయ



పరచకు. సంసారం అమర్చుకొని, గృహస్థాశ్రమ ధర్మాన్ని నిర్వర్తించు. సంఘానికి మేలు చెయ్యి." బోధించారు స్వామి.

"స్వామీ! మీకింత బలం ఎలా వచ్చింది? నాకూ అంత బలం ఉంది. కాని మిమ్మల్నెందుకు కదల్చలేక పోయాను?" విచిత్రంగా అడిగాడు ముకుందం.

"ఇది యోగశక్తి! ఈ యోగశక్తి కూడా అహంకారం ఉంటే నిష్ఫలమై పోతుంది. అహంభావానికి, మదమోహాలకు దూరంగా ఉంటూ మన బాధ్యతల్ని నెరవేర్చాలి. మనలో ఉన్న శక్తిని మనస్ఫూర్తిగా మంచికి ఉపయోగిస్తే అది తప్పక సఫలమౌతుంది."

"అంటే నా బలం ఒట్టి " సిగ్గుగా తలవంచాడు ముకుందం.

"కోపం తెచ్చుకోకు బాబూ! అది మూర్ఖపు పట్టు. అందుకే సులభంగా సడలిపోయింది." అన్నారు స్వామి.

వారిరువురూ చాలాసేపు మవునంగా ఉండిపోయారు. ముకుందానికి ఇంతకు ముందు విన్న కథంతా మళ్లీ ఇంకొక సారి మదిలో మెదిలింది.

'ఒక్కసారి ఈ స్వామిని తీసుకెళ్ళి అమ్మకి, నాన్నకి చూపిస్తే!'అన్పించింది. ఆ మాట పైకి అని "వస్తారా స్వామీ!" ఆతృతగా స్వామిని అడిగాడు ముకుందం.

"తప్పకుండాను. నడు బాబూ! ముకుందంతో బయలుదేరారు స్వామి. తల్లిదండ్రుల ఆనందాన్ని ఊహిస్తూ ముందడుగు వేశాడు ముకుందం సంతోషంగా. ముగ్గురు శిష్యులూ వారిని అనుసరించారు.